క్లుప్తంగా

డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపొద్దు



తిరువూరు: వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు పొందాలని విజయవాడ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వి. శివరామగౌడ్ అన్నారు. స్థానిక శ్రీ వాహినీ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని చెప్పారు. రవాణా శాఖ అధికారులు జమలయ్య, వాసు, కళాశాల చైర్మన్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, కోశాధికారి ముత్యాల కిశోర్, ఎన్ఎస్ఎస్ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

కుర్చీలు, ఫ్యాన్ల పంపిణీ

ఆగిరిపల్లి: చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆర్థిక సహకారంతో ఈదర జెడ్పీ హైస్కూల్‌కు 40 కుర్చీలు, 20 సీలింగ్ ఫ్యాన్లు, సౌండ్ సిస్టంను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు సిద్ధార్థ, స్ఫూర్తిని ప్రధానోపాధ్యాయిని ఎస్. శారద ఘనంగా సన్మానించారు. సర్పంచ్ అనిత, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ అంజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖోఖోలో విద్యార్థుల ప్రతిభ



మైలవరం: మైలవరం మండలం చంద్రగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో మైలవరం ఎస్వీఆర్వీఎన్నార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఖోఖో విభాగంలో ప్రతిభ చూపి పతకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. సతీష్ శనివారం తెలిపారు. అండర్-17 బాలుర విభాగం, అండర్-14 విభాగంలో ద్వితీయ స్థానాలు సాధించారన్నారు. చక్కని ఆట తీరును ప్రదర్శించిన విద్యార్థులను, శిక్షణనిచ్చిన పీడీ ఎం. రవికుమార్, శ్రీనివాసరావును పాఠశాల ప్రాంగణం దాత, జమీందారు ఎస్వీ సుధాకరరావు, ఎస్ఎన్ నివృతరావు, ప్రధానోపాధ్యాయుడు సతీష్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ టి. ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కార్నియాల సేకరణ

తిరువూరు: తిరువూరులో శనివారం మరణించిన వృద్ధుడి కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను లయన్స్ క్లబ్‌కు దానమిచ్చారు. మృతుడు ఎర్నేని బాబూరావు (80) భార్య జ్యోతి అంగీకారం మేరకు విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి నిపుణులు కార్నియాలను సేకరించారు.

250 మందికి వైద్య పరీక్షలు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): డాక్టర్ మోహనరావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్ రజతోత్సవం సందర్భంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రముఖ లాపరోస్కోపిక్ సర్జన్ డాక్టర్ నూరపనేని సుధాకర్ ప్రారంభించి మాట్లాడారు. శిబిరంలో 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మామిడి రత్నమోహనరావు, ఆస్పత్రి సిబ్బంది వైద్య సేవలందించారు.

సమర యోధుల గడ్డ తిరువూరు

- తిరువూరు ప్రాంతంలో స్ఫూర్తి రగిల్చిన ఉద్యమకారులు
- బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాలు
- స్వాతంత్ర్యోద్యమంలో తిరువూరుది ప్రముఖ పాత్ర



తిరువూరు తాలూకా కార్యాలయం

తిరువూరు: జాతీయోద్యమానికి గాంధీజీ నాయకత్వం వహించక ముందే తిరువూరు తాలూకాలో ప్రజలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని పోరాటాలు నిర్వహించారు. రాజమండ్రిలో మొట్టమొదటి విద్యార్థి సమ్మెకు నాయకత్వం వహించిన వారిలో తిరువూరుకు చెందిన కోటమర్తి సుబ్రహ్మణ్యం ప్రముఖులు. 1919లో జరిగిన కృష్ణా మండల రాజకీయ మహాసభకు ఆహ్వాన సంఘాధ్యక్షుడైన కోటగిరి వెంకట కృష్ణారావు తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం వాసి కాగా, ఆంధ్ర మహాసభకు టంగుటూరు ప్రకాశం పంతులు అధ్యక్షులుగా ఉన్నప్పుడు తిరువూరు తాలూకాలోని ముష్టికుంట్ల వాసి గద్దె రంగయ్య నాయుడు కార్యదర్శిగా పనిచేశారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఏర్పాటు చేసిన ఫార్వర్డ్ బ్లాక్ ఆంధ్ర శాఖకు అధ్యక్షులుగా తిరువూరుకు చెందిన సర్దార్ పేట బాపయ్య వ్యవహరించారు. 1930లో గంపలగూడెం మండలం అర్లపాడుకు చెందిన ఊటుకూరు సత్యనారాయణరావు బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఉపన్యాసం ఇచ్చారని ఆయనను అరెస్టు చేసి జైలులో ఉంచారు. గోసవీడుకు చెందిన నేరెళ్ల రోశయ్య జాతీయ కాంగ్రెస్ కార్యకర్తలకు భోజనం పెట్టారని, రోలుపడికి చెందిన జక్కంపల్లి నరసింహం మంచినీరు ఇచ్చారని వారిని బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేశారు. తిరువూరు తాలూకా నుంచి పేట బాపయ్య, కఠారు వీరాస్వామి, గోవిందరావు, రంగనాయకులు, రాఘవరపు వెంకయ్య, ఊటుకూరు లక్ష్మీనరసింహారావులను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారనే కారణంగా రాజమండ్రి జైలుకు తరలించారు. తిరువూరుకు చెందిన మురుకుంట్ల వెంకటప్పయ్య, చారుగుండ్ల సీతారామగుప్తా, ఊటుకూరు రామకృష్ణారావు, కోటగిరి పార్థసారథి, కాసులనాటి వెంకటేశ్వర్లు, పొన్నులూరి రాధాకృష్ణమూర్తి, కోటగిరి సూర్యప్రకాశరావులను కూడా బ్రిటిష్ పాలకులు తంజావూరు జైలులో ఉంచారు. 1931లో విజయవాడ సబ్ కలెక్టర్ తిరువూరు తాలూకాలోని అన్ని గ్రామాల్లో కల్లు దుకాణాలు వేలం వేయడానికి పాటలు పెట్టగా కాంగ్రెస్ కార్యకర్తలు ఈ పాటలను అడ్డుకున్నారు. తిరువూరు తాలూకా ఆఫీసు ఎదుట ప్రముఖ న్యాయవాది పీసపాటి లక్ష్మీకాంతం, కోటమర్తి సీతారామయ్యలు ఖద్దరు బట్టలు ధరించినందుకు పోలీసులు ఇరువురిని బట్టలు ఊడదీయించారు. ఈ విషయంపై లండన్‌లోని హౌస్ ఆఫ్ కామర్స్ సభలో సభ్యులు బ్రిటీష్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



తిరువూరు ఎంఈవో కార్యాలయం వద్ద సమరయోధుల స్మారక స్థూపం

క్విట్ ఇండియా ఉద్యమంలోనూ...

1942 క్విట్ ఇండియా ఉద్యమంలో తిరువూరుకు చెందిన మారేపల్లి సుబ్బారావు అధ్యక్షత వహించగా మురుకుంట్ల వెంకటప్పయ్య ప్రసంగించారు. వెంకటప్పయ్యను బ్రిటిష్ పోలీసులు అరెస్టు చేయగా, ఇందుకు నిరసనగా మారేపల్లి సుబ్బారావు మరికొందరితో కలిసి తిరువూరు-నూజివీడు మార్గంలో టెలిఫోన్ తీగెలను తెంచేశారు. క్విట్ ఇండియా ఉద్యమానికి మద్దతుగా తిరువూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సువారపు కృష్ణమూర్తి, గంగుసత్యం, గుర్రం నారాయణరావులు తగులబెట్టారు.

గానుగపాడు రిపబ్లిక్ ఏర్పాటు

బ్రిటీష్ పాలకులపై పోరాటంలో భాగంగా చేపట్టిన ఉద్యమంలో పలువురు సమర యోధులు గానుగపాడు వెళ్లి పోలీసు నాకాపై జాతీయ పతాకం ఎగురవేశారు. అనంతరం గానుగపాడు శివారు గ్రామాల ప్రజలు కలిసి గానుగపాడు రిపబ్లిక్ కమిటీ ఏర్పాటు చేసి చిమిరాల సీతారామయ్యను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఇందులో గానుగపాడు, పల్లెర్లమూడి, చైటపల్లి, టేకులపల్లి, చిక్కుళ్ళగూడెం, కొత్తూరు గ్రామాల నుంచి కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. పోరాటాలకు కావలసిన ఆయుధాలు తిరువూరుకు చెందిన గుండిమెట లక్ష్మీనారాయణ, పసుపులేటి వీరయ్యలు తయారుచేశారు. ప్రమాదకర మందుసామగ్రి తయారుచేస్తుండగా అవి పేలి వీరిరువురు మరణించారు. గానుగపాడు రిపబ్లిక్‌లో పోరాడిన 60 మంది యోధులకు కేంద్రప్రభుత్వం స్వాతంత్ర్యానంతరం సమరయోధుల పెన్షన్లు కూడా మంజూరు చేసింది. వీర తెలంగాణ విప్లవ పోరాటానికి కూడా తిరువూరు తాలూకా ప్రజలు అండగా నిలిచారు. 1949 డిసెంబర్, 1950 మార్చి నెలల్లో తెలంగాణ గెరిల్లాల సహాయంతో పలు గ్రామాలపై దాడులు చేసి భూస్వాముల నుంచి బంగారం, తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికి బ్రిటీష్ పాలకులు నిర్మించిన గానుగపాడు నాకా, తిరువూరులోని తహసీల్దారు కార్యాలయం, సబ్ జైలు, పోలీస్‌స్టేషన్, ఉప ఖజానా భవనాలు చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తాయి.

పన్నుల వసూళ్లపై దృష్టి సారించండి

మున్సిపల్ ఆర్‌డీ నాగనరసింహారావు



నూజివీడు: మున్సిపాలిటీల్లో పన్నుల వసూళ్లపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించి ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేయాలని రాజమండ్రి మున్సిపల్ ఆర్‌డీ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని మున్సిపల్ అధికారులతో ఆర్‌డీ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఆయన పన్ను వసూళ్లు, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి పన్ను, ఈ ఆఫీస్, రెవెన్యూ పెంపు తదితర అంశాలపై సమీక్ష జరిపి మున్సిపల్ కమిషనర్లకు పలు సూచనలు చేశారు. ఆస్తి పన్ను వసూళ్లను ముమ్మరం చేసి మార్చి నెలాఖరు కల్లా పూర్తి చేయాలన్నారు. పట్టణాల్లో కుక్కల బెడద సమస్య పరిష్కారానికి ఆయా మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

నూజివీడు: పర్యావరణ పరిరక్షణకు అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక్క మొక్క నాటాలని నున్న పవర్ గ్రిడ్ సీనియర్ జనరల్ మేనేజర్ కె. నాగమోహన్‌రావు అన్నారు. నూజివీడులోని ట్రిపుల్ ఐటీకి శనివారం 200 మొక్కలు అందజేశారు. విద్యార్థులతో కలిసి శనివారం మొక్కలు నాటి మాట్లాడారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం



నూజివీడులో ప్రతిజ్ఞ చేయిస్తున్న స్మరణ్‌రాజ్



విస్సన్నపేటలో ఓటరు దినోత్సవ ర్యాలీ

సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్

నూజివీడు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధమని, ప్రజలంతా ఓటు ప్రాధాన్యతను తెలుసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో శనివారం విద్యార్థులతో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి పీజీ కేంద్రం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీజీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ యువత ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎం. శ్రీనివాసు మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకుని మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లను సన్మానించారు. వ్యాసరచన, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

- **మైలవరం:** ఆరో వార్డులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పి.గోపాల్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. హెచ్ఎం గోపాల్ మాట్లాడారు. రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ కె.నాగరాజు, బి. నారాయణ, ప్రభాకరరావులను సత్కరించారు.
- రెడ్డిగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ సిటిజన్స్‌ను శాలువాలతో సత్కరించారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
- **మైలవరం:** పుల్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం సీనియర్ సిటిజన్స్‌ను సర్పంచ్ నాగమల్లేశ్వరి సత్కరించారు. మైలవరంలోని శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.
- **విస్సన్నపేట:** విస్సన్నపేట మండలంలోని పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఓటు హక్కు విలువను వివరిస్తూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సన్మానించారు.
- **గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం):** జాతీయ ఓటర్ల దినోత్సవం మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహించారు. గ్రామ సచివాలయాలు, పాఠశాలల వద్ద సర్పంచులు, కార్యదర్శులు, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సన్మానించారు. గుంటుపల్లి పంచాయతీలో సర్పంచి భుక్యా కవిత, కార్యదర్శి మునేశ్వరరావు ఉద్యోగులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.
- **తిరువూరురూరల్:** ఆంజనేయపురం, చిట్టేల గ్రామాల్లో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఓటర్లను సత్కరించారు. సర్పంచులు మామిడి కుటుంబరావు, తుమ్మలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.
- **చాట్రాయి:** ఓటు హక్కు ఎంతో విలువైనదని తహసీల్దార్ డి. ప్రశాంతి అన్నారు. చాట్రాయిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు మెరుగైన సమాజ నిర్మాణానికి దోహద పడుతుందని చెప్పారు.
- **తిరువూరు:** తిరువూరు శాంతినగర్ ఎంపీపీ స్కూల్‌లో సీనియర్ ఓటర్లను సత్కరించారు. ఎంఈవోలు శ్యాంసుందర్, రామకృష్ణ, బీఎల్‌వోలు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందాలి



మైలవరం: విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందాలని ఎల్బీఆర్సీఈ కో ఫౌండర్, హానరరీ చైర్మన్ లకిరెడ్డి జయప్రకాశ్‌రెడ్డి అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం లక్ష్య-2కే25 కార్యక్రమం శనివారం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని అంశాలలో నైపుణ్యం మెరుగు పర్చుకోవాలన్నారు. విజయవాడ హెచ్‌సీఎల్ హెచ్‌ఆర్ మేనేజర్ సుంకర రాజేష్ మాట్లాడుతూ పరిశ్రమలు, విద్యార్థుల నైపుణ్యాలు అనే అంశంపై సోదాహరణగా వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు, కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రమేష్‌రెడ్డి అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంకేతిక విభాగంలో నిర్వహించిన మేధ, సృజన, ప్రజ్ఞ, ఉద్భావన, రంగమార్తాండ, ఓజాస్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రభుత్వ పాఠశాలకు దాతల వితరణ

తిరువూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సదుపాయాల కల్పన నిమిత్తం ఇరువురు న్యాయవాదులు శనివారం విరాళాలు అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థులైన న్యాయవాదులు సంకురాత్రి జనార్దనరావు, మోదుగుమూడి శ్రీనివాసరావు రూ.5 వేల చొప్పున ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు కె. శంకర రావుకు అందజేశారు.

విద్యార్థులకు చెక్కుల పంపిణీ



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): గత విద్యా సంవత్సరం పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 18 మంది విద్యార్థులకు చెక్కులు, సర్టిఫికెట్లను శనివారం అందజేశారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని ఏపీఎం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో చనమోలు లక్ష్మీకాంతమ్మ, వెంకటరామయ్య మెమోరియల్ ట్రస్ట్ వెలగలేరు మేనేజింగ్ ట్రస్టీ చనమోలు అమరలింగం ఆధ్వర్యంలో విద్యార్థులకు చెక్కులను పంపిణీ చేశారు. చనమోలు అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువుల చదివి ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. చనమోలు రామ్మోహనరావు, నాగమల్లేశ్వరరావు, బాబురావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో పశు వైద్య శిబిరం

మైలవరం: రెడ్డిగూడెంలోని పశు వైద్యశాలలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి యజమానులకు పలు సూచనలు చేశారు. పశు పోషకులకు పశువుల దాణా అందజేశారు. పశువైద్యాధికారి, పశు పోషకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

కోడి పందేల శిబిరంపై దాడి: 9 మంది అరెస్టు

మైలవరం: రెడ్డిగూడెంలోని నూజివీడు రోడ్డు పక్కన మామిడి తోటలో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై శనివారం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడుల్లో 9 మంది పందెంరాయుళ్లను అరెస్టు చేసి వారి నుంచి రూ.8,150 నగదు, 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన అవసరం

విస్సన్నపేట: విద్యార్థులు చదువుతో పాటు దేశ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగి వుండాలని కృష్ణా విశ్వవిద్యాలయ రెక్టార్ బసవేశ్వరరావు అన్నారు. విస్సన్నపేట డీకేఎస్వీ జూనియర్ కళాశాల వార్షికోత్సవం శనివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కళాశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ మేడా మోహనరావు, డైరెక్టర్ హర్ష, అధ్యాపకులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఆపదలో ఉన్న వారికి రక్త దానం చేసి ప్రాణదాతలుగా మారాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ గద్దే శేషగిరిరావు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కొండపల్లి ఇండస్ట్రియల్ పార్క్ ఆధ్వర్యంలో ఐడీఏలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పలువురు దాతలు రక్తదానం చేశారు. క్లబ్ అధ్యక్షుడు రేగళ్ల రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

నూజివీడు: నూజివీడు మండలం రేగుంటలో ఎక్సైజ్ సిబ్బంది శనివారం నిర్వహించిన దాడుల్లో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారని ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడు కోమవరపు రాంకీపై కేసు నమోదు చేశారు.

550 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

తిరువూరు: తిరువూరు ఎక్సైజ్ సర్కిల్లో శనివారం సారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాలో 150 లీటర్లు, తిరువూరు మండలం మల్లేల వద్ద 400 లీటర్ల బెల్లపు ఊటను సారా తయారీకి సిద్ధం చేసినట్లు గుర్తించి ధ్వంసం చేశామని ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ వెంకటకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

ఆగిరిపల్లి: కృత్యాధార బోధన ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఏలూరు జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రెడ్డి రామారావు సూచించారు. తోటపల్లి హీల్ పారడైజ్ పాఠశాలలో ఆరు రోజులుగా ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులందరి తరఫున హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్య ప్రసాద్‌కు రూ.1.60 లక్షలు విరాళాన్ని అందజేశారు.

ఎన్‌సీడీ సర్వేలో వ్యాధుల గుర్తింపు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): ఎన్‌సీడీ సర్వేలో వివిధ వ్యాధిగ్రస్తుల గుర్తింపు జరుగుతోందని పీహెచ్‌సీ వైద్యురాలు పర్వీన్ తెలిపారు. కిలేశపురంలో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఎన్‌సీడీ సర్వేను శనివారం ఆమె పరిశీలించారు. 30 ఏళ్లు పైబడిన వారికి నిర్వహిస్తున్న ఎన్‌సీడీ-3.0 సర్వే ద్వారా బయట పడుతున్న మధుమేహం, క్యాన్సర్, బీపీ తదితర వ్యాధులకు ముందస్తుగా చికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు. ఏఎన్ఎం కామేశ్వరి, ఎంపీహెచ్ఓ క్రాంతి, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులను సంరక్షించుకోవాలి

ముసునూరు: పశువుల్లో సంభవించే వ్యాధులను నివారించి, వాటిని సంరక్షిస్తే పశు పోషకులు లాభాలు పొందగలరని మండల పశు వైద్యాధికారి ఎం.వెంకట చైతన్య అన్నారు. ముసునూరు, గుడిపాడులో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పశువులకు పరీక్షలు నిర్వహించి వ్యాధి నిరోధక టీకాలు వేశారు.

డ్రెయినేజీల్లో పూడిక తొలగించాలి

నూజివీడు: పట్టణంలోని పలు డ్రెయినేజీలను మున్సిపల్ ఆర్డీ సీహెచ్ నాగనరసింహారావు శనివారం పరిశీలించారు. డ్రెయినేజీల్లో పూడికను తొలగించడంతో పాటు పిచ్చిమొక్కలు, చెత్తచెదారాన్ని తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఆర్. వెంకట రామిరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాల పరిశీలన

నూజివీడు: పట్టణంలోని ఎమ్మార్ అప్పారావు కాలనీ వద్ద నిర్మించిన టిడ్కో గృహాలను టిడ్కో చైర్మన్ వేములపల్లి అజయ్‌కుమార్ శనివారం పరిశీలించారు. అధికారులను అడిగి వివిధ దశల్లో ఉన్న గృహాల వివరాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జూన్ నాటికి కొన్ని ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

తహసీల్దార్ లక్ష్మీ కల్యాణికి అవార్డు ప్రదానం

విస్సన్నపేట: ఓటర్ల నమోదు ప్రక్రియలో విశేష కృషి చేసినందుకు విస్సన్నపేట తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి శనివారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ విజయానంద్ నుంచి అవార్డు అందుకున్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సహాయ ఓటరు నమోదు అధికారి అవార్డును ఆమె స్వీకరించారు. కలెక్టర్ లక్ష్మీశ తదితరులు పాల్గొన్నారు.